## వృద్ధుడు అదృశ్యం


నారాయణరెడ్డి(ఫైల్)

దుండిగల్, మే 28: వాకింగ్‌కు బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం...ఏపీలోని కడప జిల్లా, పులివెందులకు చెందిన గవిరెడ్డి నారాయణరెడ్డి(70) అనే వృద్ధుడు గత కొన్ని రోజుల కిందట గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని వైష్ణవినగర్‌లో నివాసముంటున్న తన కూతురు వద్దకు వచ్చాడు. ఈనేపథ్యంలో నారాయణరెడ్డి ఈనెల 27వ తేదీన ఉదయం 7 గంటలకు వాకింగ్ కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. రాత్రి అయినా ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. బంధువులు, స్నేహితుల ఇండ్లల్లోనూ ఆరా తీసినా ఫలితం దక్కలేదు. దీంతో నారాయణరెడ్డి అల్లుడు మనోహర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునారు. అయితే నారాయణరెడ్డి పుట్టు మూగ, చెవిటితనంతో బాధపడుతున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

### అడ్డగుట్టలోని నిరుద్యోగి..


పవన్‌కల్యాణ్‌రెడ్డి(ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, మే 28: ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న ఓ నిరుద్యోగి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ అడ్డగుట్టలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో బుర్రముక్క పవన్ కల్యాణ్‌రెడ్డి(26)నివసిస్తూ ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. తన బంధువు ఈనెల 26వ తేదీన పలుమార్లు పవన్ కల్యాణ్‌రెడ్డికి ఫోన్ చేసినా స్పందించలేదు. హాస్టల్‌కి వెళ్లి విచారిస్తే ఈనెల 26న అతను హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. బంధుమిత్రులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


అనసూయ(ఫైల్)

అల్లాపూర్, మే 28: నిర్మాణంలో ఉన్న భవనంలో కూలీగా పనిచేస్తున్న ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ వెంకటరెడ్డి తెలిపిన ప్రకారం... అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన గుంపు అనసూయ(50) భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నది. సర్దార్‌నగర్ ఈ బ్లాక్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో రోజులాగే బుధవారం కూలీ పనికి వచ్చింది. మెటీరియల్ లిఫ్టింగ్ చేస్తున్న క్రేన్‌కు విద్యుత్ షాక్ తగిలి ఒక్కసారిగా కుప్ప కూలింది. దీంతో స్థానిక ఈఎస్‌ఐ దవాఖానకు అనసూయను తరలించగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. భవన యజమాని కనీస భద్రత కూడా పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. 200 గజాల్లో నిర్మిస్తున్న ఐదంతస్తుల భవనానికి జీరో పర్మీషన్, కొరవడిన టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. సదరు నిర్మాణంపై జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ఉన్నామని తెలిపారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 28: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 35, కాకరకాయ 45, బీరకాయ 40, క్యాబేజి 13, ఫ్రెంచ్ బీన్స్ 105, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 23, కందగడ్డ 65, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 18, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 26, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు కల్పిస్తా

కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

బాలానగర్, మే 28:బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం వినాయకనగర్‌లోని ఆయన కార్యాలయంలో బాలానగర్ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయనిర్మల తమ సిబ్బందితో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కావాల్సిన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలతో పాటు ఇతర రోగులు కూడా తరచూ వచ్చి పలు చికిత్సలతోపాటు వైద్య సేవలు పొందుతున్నారని తెలియజేశారు. బాలానగర్ మెడికల్ ఆఫీసర్‌గా సీనియర్ వైద్యులు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్ ఎన్.రాములమ్మ, సూపర్‌వైజర్ రవి కుమార్, స్వరూప, రజిత, యామిని, పాపమ్మ, ఎంపీ హెచ్ ఎ.రోహిణి పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

దుండిగల్, మే 28:దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గండిమైసమ్మ-మియాపూర్, బహదూర్‌పల్లి-కొంపల్లి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అదేవిధంగా మల్లంపేట్ రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, తద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి దుండిగల్ మున్సిపాలిటీని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా అభివృద్ధిపరచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, గండిమైసమ్మ దుండిగల్ మండలం తహసీల్దార్ మతిన్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఏడవ డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో గల అయ్యప్ప స్వామి దేవాలయం 2వ వార్షికోత్సవ వేడుకలకు బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై హరిహర సుతుడు అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో అరుణ్ గురుస్వామి, బ్రహ్మశ్రీ రాజన్ నంబూద్రి గురుస్వామి, నాగార్జున ఆచార్యులు (లాలూ స్వామి)తో పాటు ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయ యాదవ్, రఘువేంద్రరావు, రవి కిరణ్, బాలాజీ నాయక్, బొర్రా దేవి చందు ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, హరిబాబు, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు అభినందన..**

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద సూరారం వెంకటరామ్‌నగర్‌లోని నార్త్ సిటీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన ఎస్ఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అనుష్క నూనె(586), వివేక్(571), జాన్సీ(567), కుంకుమ్(558) ఝాన్సీ(557), గణేశ్(557), అర్చన (553), మనిత్(552)లను ఎమ్మెల్యే ఉన్నత ఆశయాలతో విద్యనభ్యసించి ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 28: కేపీహెచ్‌బీ కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం... కాలనీ 3వ పేజ్ ఎల్ఐజీ 35/2లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆకస్మికంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో జీతం బసంత్ రెడ్డి, గచిమారి శేఖర్, మీదటపల్లి పర్వ రాములు, వసంత శివ నాగేశ్వరరావు, నెల్లూరీ శ్రీరామ్మూర్తి, ముండూరు వెంకట్రావు, ముండూరు రమేశ్‌బాబులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.26,210 నగదును, 7 సెల్ ఫోన్‌లను, 22 సెట్ల ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## వ్యభిచార గృహంపై దాడి

నిర్వాహకుడు, విటుడు అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 28: కెపిహెచ్బి కాలనీ 4వ పేజ్ లో గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. కాలనీ 4వ పేజ్ ఎల్ఐజీ బ్లాక్ 7బీ ప్లాట్ నెంబర్ 422లో వ్యభిచారం సాగుతుందని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే దాడి చేయగా.. ఆ ప్లాట్ లో వ్యభిచారం సాగుతున్నట్లు గుర్తించిన పోలీసులు... నిర్వాహకుడు మురళి తో పాటు... విటుడు ధీరజ్, మరొక మహిళను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేదల ఆకలిని తీర్చడం అభినందనీయం



కేపీహెచ్‌బీ కాలనీ మలబార్ గోల్డ్‌లో హంగర్ టు ఫీడ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీషబాబురావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 28: ఆకలితో ఉన్న పేదవారికి అన్నదానం చేయడం అభినందనీయమని బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన హంగర్ టు ఫీడ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్టోర్ డైరెక్టర్ ఇర్ఫాన్, మేనేజర్ నజీర్, మహేందర్, రాజిరెడ్డి, శ్రీశైలం, స్వప్న తదితరులు ఉన్నారు.

# డ్రైయిన్లలో చెత్త పేరుకుపోకుండా చూడాలి

వరద ముంపు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన


లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి వరద ముంపు కాలువను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

శేరిలింగంపల్లి, మే 28:వరద ముంపు ప్రాంతాల్లో కాలువలు, నీరు నిలిచే ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. గోపిచెరువు, చాకలి చెరువుల నుంచి వచ్చే వరదతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరదలతో ఇబ్బంది ఏర్పడుతుందని జీహెచ్‌ఎంసీ అధికారులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. బాక్స్ డ్రైయిన్ పనులు విస్తరించడంతో ఈ ఏడాది కొంత సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. డ్రైన్లలో చెత్త పేరుకుపోకుండా చూడాలని అధికారులను ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, శేరిలింగంపల్లి డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్ తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యవేక్షణ లోపం..రోడ్డుపై మట్టి పారబోత


మట్టిలో భారీ బండలు


మట్టి పోస్తున్న టిప్పర్ వాహనం

జగద్గిరిగుట్ట, మే 28: నిర్మాణ వ్యర్థాలు, తవ్వకాల మట్టి రోడ్లపై పారబోస్తే కఠిన చర్యలు తప్పవు.. ఇది మున్సిపల్, హైడ్రా అధికారుల హుకుం. ఇతరుల మాట వదిలేసి, ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లోని మట్టి, వ్యర్థాలు ప్రధాన రహదారిపై పోస్తున్నా పట్టించుకునే దిక్కులేదు. ఈ పరిస్థితి జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డు డంపుయార్డు పక్కన కనిపిస్తున్నది. ఇక్కడి హెచ్‌ఎంటీ భూమిలో డంపుయార్డు సమీపంలో బ్లూ క్రాస్ సంస్థకు స్థలం కేటాయించారు. ఇటీవల ప్రాంతాన్ని చదును చేసి ప్రహరీ కోసం పనులు చేపట్టారు. ఎత్తుగా ఉన్న ప్రాంతాన్ని యంత్రాల సాయంతో తవ్వి సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై టిప్పర్లతో పారపోశారు. కేవలం మట్టి అయితే పర్వాలేదు.. కానీ భారీ బండరాళ్లు ఉండటం ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు బండరాళ్లను ఢీకొంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మట్టి పారబోస్తున్న ప్రాంతంలోనే సీసీ కెమెరాలు ఉన్నాయి. అయినా పట్టించుకోకుండా మూడు రోజులుగా మట్టిని డంప్ చేస్తున్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, హెచ్ఎంటీ కంపెనీలో సంయుక్త పర్యవేక్షణ ప్రాంతంపైగా అన్నింటికి హైడ్రా అంటున్న పరిస్థితుల్లో పారబోత స్థానికులను విస్తు పోయేలా చేస్తున్నది. ఇక్కడికి సమీపంలోని డీసీపీ కార్యాలయం వద్ద భవన నిర్మాణాల వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేకంగా యార్డ్ ఏర్పాటు చేశారు.

భారీగా ఉంటే గాజులరామారం సమీపం రాంకీ కేంద్రానికి తరలించాల్సి ఉన్నది. గతంలోనూ ఇదే రోడ్డుకు ఇరువైపులా భారీగా వ్యర్థాలు పారబోయగా యంత్రాలతో చదును చేశారు. ఇకనైనా అధికారులు సొంత పనుల్లో నియంత్రణ చర్యలు తీసుకొని ప్రైవేటు వ్యక్తులకు ఆదర్శంగా నిలవాల్సి ఉన్నది.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

## రాజీవ్ యువ వికాసంతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

**మేడ్చల్, మే 28:** రాజీవ్ యువ వికాస పథకంతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టరేట్ గౌతమ్ అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్డీవో సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, ఎల్డీఎం, ఎస్సీ కార్పొరేషన్ఈడీ బాబు మోసిస్, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సేవలు మరువలేనివి..

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కేపీహెచ్బీ కాలనీ వసంతనగర్ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 28: తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా కూకట్‌పల్లి కాలనీ, వసంతనగర్ కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నటుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని అన్నారు. పేదలకు రూ.2లకే కిలో బియ్యం, పటేల్‌పట్వారి వ్యవస్థను రద్దు చేసి సుపరిపాలన అందించారన్నారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో తాను నడుస్తున్నట్లు తెలిపారు. స్థానిక నేతలు మందలపు సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, సొసైటీ అధ్యక్షుడు ఎర్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**జేఎన్టీయూహెచ్ చౌరస్తాలో...:** జేఎన్టీయూహెచ్ చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి జనసేన ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అట్లూరు దీపక్, కొల్లూరి శ్రీనివాసరావు, కొల్లా శంకర్, సుబ్బు, శంకర్రావు, శివ నారాయణ, ప్రవీణ్, రవి, కిశోర్‌బాబు తదితరులు ఉన్నారు.

## లార్వా దశలోనే దోమలను నియంత్రించాలి


బాలాజీనగర్‌లో దోమల నియంత్రణపై స్పెషల్‌డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

కేపీహెచ్‌బీ కాలనీ, మే 28: లార్వా దశలోనే దోమలను నియంత్రించాలని కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబురావు అన్నారు. బుధవారం బాలాజీనగర్‌లో ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపరిశుభ్రమైన పరిసరాలతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయని, ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎంటమాలజిస్ట్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ దోమలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ సోని, స్థానిక నేతలు లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, నాగేశ్వరరావు, రమణ, విజయ్ తదితరులు ఉన్నారు.

## భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం


పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబియాబేగం

అల్లాపూర్, మే 28: డివిజన్ పరిధిలోని పద్మావతినగర్‌లో450 ఎంఎం డయా రూ.6లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ సబియాబేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయితే.. సున్నం చెరువులోకి మురుగునీరు కలువకుండా ఉంటుందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు మొగులయ్య, జావిదొద్దీన్, సాజీద్ డాక్టర్, కమల్ వాసన్, శ్రీనివాస్‌రావు, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నోలో 8 గంటల పని విధానం

యాజమాన్యంతో చర్చలు సఫలం


చర్చల అనంతరం విజయోత్సవ నినాదాలు చేస్తున్న సీఐటీయూ కార్మికులు, నాయకులు

**మేడ్చల్, మే 28:** టైం టెక్నో కంపెనీ యాజమాన్యంతో కార్మికుల తరుపున సీఐటీయూ జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. కంపెనీ కార్మికుల డిమాండ్‌కు అనుగుణంగా పని గంటల నిర్వహించేందుకు ఒప్పుకుంది. రెండు రోజులుగా కంపెనీ యజమాన్యం బలవంతంగా అమలు చేస్తున్న 12 గంటల పని విధానంపై సీఐటీయూ ఆందోళన నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా యాజమాన్యం కార్మికులు, సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపింది. 8 గంటల పని విధానంతో ఇతరత్రా సౌకర్యాలను కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల కన్వీనర్ నరేశ్ మాట్లాడుతూ టైం టెక్నో కంపెనీ ఉత్పత్తిని పెంచుకునేందుకు 8 గంటలకు బదులు అదనంగా ఎలాంటి చెల్లింపులు లేకుండా 12 గంటల పని విధానాన్ని అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. ఇది చట్టాన్ని కాలరాయడమేనని అన్నారు. ఉత్పత్తిని పెంచుకోవాలంటే కార్మికుల సంఖ్యను పెంచుకోవాలని కానీ శ్రమ దోపిడీకి పాల్పడటం సరికాదన్నపారు. విషయాన్ని తెలుసుకొని తాము కార్మికులు తరుపున పోరాటం చేయగా యాజమాన్యం తమతో చర్చించి, 8 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు ఒప్పుకుందన్నారు. అదనపు పని గంటలకు డబుల్ ఓటీ చెల్లించేందుకు అంగీకరించిందని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌లను కూడా చట్ట ప్రకారం అమలు చేయాలని కోరగా అమలుకు సుముఖత వ్యక్తం చేసిందని వారు చెప్పారు. కార్మికులు సంఘటితంగా పోరాటం చేస్తే తప్పకుండా హక్కుల పరిరక్షణ సాధ్యం అవుతుందని తెలిపారు. భవిష్యత్‌లో కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాము అండగా ఉంటామని వారు హెచ్చరించారు.

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client namely **Sri. MAYANK MUNJAL** S/o. NAVEEN KUMAR MUNJAL,(Aadhaar No.4156 0874 5644), R/o. Hyderabad, Telangana State is purchasing the Property bearing Flat No. **502,** Fifth Floor, (PTI No.1119960242), bearing GHMC No. 1-55/187/GP/502, having built-up area of **600 Sq. feet,** (including common area) plus one Car Parking space of 100 Square feet, together with undivided share of land admeasuring 20.00 Sq. yards (out of 2178 Sq. yards), Constructed in Survey No. 187 (Part), in building known as **"GAUTHAMI PARADISE"** Situated at KONDAPUR VILLAGE, Serilingampally Mandal and GHMC, Ranga Reddy District, Telangana State from it's Legal Owner and peaceful Possessor namely **Sri. NALLAPAREDDY RAJENDRAKUMAR REDDY** S/o Late. SRINIVASULU REDDY,(Aadhaar No.4706 9088 2001), R/o. Hyderabad, Telangana State and my Clients has also paid substantial sale consideration amount to the above said seller for purchase of above said property.

Any person/s or any organization is having any right, title, interest, claim, Token Advances, Prior Agreements, double Registration issues, Neighbour Issues, Family Issues,Civil Issues, Mortgages, Charge or Demand or any type of other issues on the aforesaid Property may intimate their objections in writing with relevant documents to contact me in below mentioned address within **TEN (10) DAYS** from the date of this publication or else my client will proceed with sale transaction and also Registering the above said Property in my client favour at concerned Registration office, thereafter no claims of whatsoever nature shall not be entertained.

Sd/- **S.VENKAT RAO** M.Com,LL.B.
ADVOCATE.
Plot No.1, KONDAPUR "x" ROAD, SERILINGAMPALLY, HYDERABAD. Cell: **98482 47466.**